01 page 26_01 page 26.qxd 25-04-2026 PM 10:28 Page 1

కర్నూలు | నంద్యాల
వార్త
26 ఏప్రిల్ 2026 ఆదివారం పేజీలు 4

# హాస్టళ్లను తనిఖీ చేసిన.. జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు హాస్పిటల్ ఏప్రిల్ 25 ప్రభాతవార్త :
కర్నూలు, రాజ్ విహార్ సమీపంలో ఉన్న మెడికల్ కళాశాల విద్యార్థుల హాస్టళ్లను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టళ్లలోని మౌలిక వసతులు, పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి, వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసు కున్నారు. తాగునీరు, ఆహారం, శానిటేషన్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ఎటువంటి లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం సహించబోదని హెచ్చరించిన కలెక్టర్, తక్షణమే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు

# టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు

**: సమయస్ఫూర్తితో ప్రాణాలు కాపాడిన సీఐ రాజశేఖర్ రెడ్డి**



**ఆదోని క్రైమ్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :**
ఆదోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేడియో స్టేషన్ సమీపంలో ఓ యువకుడు టవర్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న సీఐ రాజశేఖర్ రెడ్డి వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బలప్రయోగం చేయకుండా, ఓర్పుతో సమస్యను పరిష్కరించాలని నిర్ణయించిన సీఐ, యువకుడు సురేంద్రతో మాట్లాడారు. అతని మనస్థితిని అర్థం చేసుకుంటూ, "నీ భార్య నాగేశ్వరితో మాట్లాడిస్తాం" అంటూ నమ్మకం కలిగించారు. ఆ మాటలు సురేంద్రలో ధైర్యం నింపాయి. కొన్ని గంటల పాటు కొనసాగిన ఉద్విగ్న పరిస్థితుల్లో, సీఐ చూపిన సహనం, చాకచక్యం కలిసి పనిచేసి చివరకు సురేంద్రను సురక్షితంగా కిందికి దింపగలిగారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సురేంద్ర ఏడునెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడని తెలిపారు. అయితే భార్య తల్లిదండ్రులు ఆమెను కాపురానికి పంపకపోవడంతో మనస్థాపానికి గురై, ఈ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని వివరించారు. అనంతరం సీఐ స్వయంగా ఆలూరుకు వెళ్లి నాగేశ్వరి తల్లిదండ్రులతో మాట్లాడి, ఇరు కుటుంబాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సమయస్ఫూర్తి, మానవత్వం కలిసినప్పుడు ఒక ప్రాణం మాత్రమే కాదు, ఒక కుటుంబం కూడా నిలబడుతుందనే ఉదాహరణగా ఈ ఘటన నిలిచింది.



# జిల్లాలో.. పెట్రోల్, డీజిల్ కొరత లేదు

**: జిల్లాలో తగినంత నిల్వలు**
**: అపోహలు నమ్మవద్దని హెచ్చరిక**
**: బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు**

**జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై ఎటువంటి కొరత లేదని, అవసరానికి తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి స్పష్టం చేశారు. ప్రజలు అపోహలకు లోనై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో కలిసి నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఈ విషయాలు వెల్లడించారు.**



కర్నూలు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :
జిల్లాలో మొత్తం 166 పెట్రోల్ బంకులు పనిచేస్తున్నాయని, అవి బిపిసిఎల్, హెచ్‌పి, ఐఓసీఎల్, జియో, నయారా వంటి ప్రధాన కంపెనీలకు చెందినవని తెలిపారు. జిల్లాలో రోజుకు సగటున 2,36,000 లీటర్ల పెట్రోల్ వినియోగం జరుగుతుండగా, ప్రస్తుతం 7 లక్షల లీటర్ల పెట్రోల్ నిల్వ ఉందని చెప్పారు. అదనంగా ట్రాన్సిట్‌లో 6,39,000 లీటర్లు ఉండటంతో మొత్తం 13,19,439 లీటర్ల పెట్రోల్ అందుబాటులో ఉందని వివరించారు. ఈ నిల్వలతో 6 నుంచి 7 రోజుల వరకు సరఫరా కొనసాగించగలమని తెలిపారు. డీజిల్ విషయంలో కూడా ఎటువంటి కొరత లేదని వెల్లడించారు. రోజుకు సగటున 3,16,848 లీటర్ల డీజిల్ వినియోగం జరుగుతుండగా, ప్రస్తుతం 5,65,000 లీటర్ల నిల్వతో పాటు ట్రాన్సిట్‌లో 5,06,564 లీటర్లు ఉన్నాయని చెప్పారు. మొత్తం 11 లక్షల లీటర్ల డీజిల్ అందుబాటులో ఉండటంతో సుమారు 4 రోజుల పాటు నిరంతర సరఫరా కొనసాగుతుందని తెలిపారు. అయితే ప్రజలు భయంతో అధికంగా పెట్రోల్, డీజిల్‌ను క్యాన్లు, డబ్బాలు, బ్యారెల్స్‌లో నిల్వ చేసుకోవడం వల్ల జిల్లాలోని 166 బంకుల్లో 32 బంకులు తాత్కాలికంగా డ్రై అవుట్ అయినట్లు పేర్కొన్నారు. ధరలు పెరుగుతాయని జరుగుతున్న ప్రచారం అసత్యమని, ప్రస్తుతం పెట్రోల్ ధర సుమారు రూ.109, డీజిల్ ధర రూ.97 వద్దనే కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రజలు అవసరానికి మించి ఇంధనం కొనుగోలు చేయకుండా సాధారణంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అపోహలు నమ్మకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పెట్రోల్, డీజిల్‌ను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పేదోడి గోడు వినని ఎమ్మెల్యే..!

**: నాకు ఇల్లు లేదు,మాకు నీళ్లు రావు అంటే..**
**: పెడచెవిన పెట్టీ పక్కకు జారుకున్న పార్థ సారథి..**



**ఆదోని ఏప్రిల్ 25 ప్రభాతవార్త ప్రతినిధి :**
అయ్యా సారు మాగోడు వినండయ్యా మాకు ఇల్లు లేవు ,నీళ్ల లేవు అంటూ ఓ పేద ముసలాయన స్థానిక ఎమ్మెల్యే పార్థ సారథిని పిలవగా చూసి పట్టించుకోకుండా వెళ్లిన సందర్భం శనివారం పట్టణంలో చోటు చేసుకుంది .దీనికి సంబంధించిన వీడియో సోషల్ మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంటే నెటిజన్లు ఎమ్మెల్యే పార్థపై "తాత నీకు భూ సమస్య ఉంటే చెప్పు వస్తాడని" "తాత నీకే ఏంలేదు నాకేమోస్తావని మరికొందరు " రాజకీయాల్లో ముందే కాదు వెనక కూడా చూడండి అంటూ కొందరు, వచ్చాడు మొత్తం పట్టుకెళ్ళిపోతారు అంటూ మరి కొందరు బహిరంగంగా కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఏది ఏమైనా కొండంత హామీలతో గెలిచిన ఎమ్మెల్యే ఒక్క క్షణం కూడా ముసలాయన చెప్పేది వినకుండా ప్రజలపట్ల ,ముక్యంగా పేదల పట్ల ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరుతో నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది ..

# మలేరియా రహిత నగరంగా మార్చుదాం

**– నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు మున్సిపల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతతో నగరాన్ని మలేరియా రహితంగా మార్చుదామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డాక్టర్స్ కాలనీలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిల్వ ఉన్న స్వచ్ఛమైన నీటిలో మలేరియాను వ్యాప్తిచేసే ఆడ ఎనోఫిలిస్ దోమలు పెరుగుతాయని ఆయన తెలిపారు. దోమలకాటుకు గురికాకుండా ఉండేందుకు గృహాల్లో కిటికీలు, గుమ్మాలకు దోమల జాలీలు అమర్చుకోవాలని సూచించారు. అంతకుముందు కమిషనర్ పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను అకస్మికంగా తనిఖీచేశారు. ఈకార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం రఘు, సీనియర్ ఎంటమాలజిస్ట్ వెంకటేశ్వర్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ఉశేన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు.. వ్యక్తి మృతి

**నందికొట్కూరు,ఏప్రిల్ 25,ప్రభాతవార్త:**



మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలోని ఏబిఎం చర్చ్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కబోతు ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. శనివారం కొత్తపల్లి మండలం శివపురం గ్రామానికి చెందిన సయ్యద్ యూసుఫ్ (63) చర్చి దగ్గర బస్సు ఎక్కుతుండగా డ్రైవర్ బస్సును స్పీడుగా ముందుకు కదిలించడంతో ప్రమాదవశాత్తు బస్సుకింద పడడంతో తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా డాక్టర్లు పరీక్షించి మృతి చెందాడని తెలిపారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎమ్మిగనూరులో ట్రాఫిక్, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

**ఎమ్మిగనూరు టౌన్,ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**



ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో పోలీస్,ఆర్‌బి మరియు మున్సిపల్ శాఖల అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిర్వహణను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే ఓం శాంతి సర్కిల్, వ్యవసాయ మార్కెట్ యార్డు, పద్మశ్రీ మచాని సోమప్ప సర్కిల్, శివ సర్కిల్ మరియు కర్నూలు బైపాస్ రోడ్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాధ్యమైన చోట్ల వన్‌వే ట్రాఫిక్ అమలు చేయడం, కొత్త కాలువలు నిర్మించడం, రోడ్ల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పట్టణ పారిశుధ్య సదుపాయాలను మెరుగుపరచాలని కూడా అధికారులను ఆదేశించారు. హైవేల్లో ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ భద్రతా సూచికలు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేసి వాటిని సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. ముగతి నుండి నాగలదిన్నె వరకు బీటీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పట్టణ, గ్రామీణ మరియు గోనేగండ్ల సీఐలు, ఎస్ఐలు, హైవే అథారిటీ డీఈ, ఆర్ బి డీఈ, ఈఈ, మున్సిపల్ కమిషనర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సీసీ డ్రైనేజీలకు,పార్కుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కర్నూలు అర్బన్ ఏప్రిల్ 25 ప్రభాతవార్త :**
కల్లూరు 19వ వార్డు సోమిశెట్టి నగర్ వాటర్ ట్యాంకు నందు మున్సిపల్ పార్కులకు మరియు సీసీ డ్రైనేజీలకు 40 లక్షల అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి మరియు యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ప్రారంభించారు. వార్డ్ఇంచార్జి ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, వార్డ్ నాయకులు కిట్టు యాదవ్, చాంద్, సుబ్బు, మరియు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రిలో.. వసతుల అభివృద్ధిపై కలెక్టర్ ఆదేశాలు

**కర్నూలు, హాస్పిటల్ ఏప్రిల్ 25 ప్రభాతవార్త :**
ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం కర్నూలు మెడికల్ కళాశాల మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వైద్య సేవలు, సదుపాయాలపై హెచ్‌ఓడీలతో చర్చించారు. ఎక్కడా డాక్టర్లు లేరనే పరిస్థితి రాకూడదని, రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌లో జరుగుతున్న ఆక్సిజన్ పైప్‌లైన్, లిఫ్ట్ పనులను మే 31లోపు పూర్తి చేసి జూన్ మొదటి వారంలో ప్రారంభోత్సవం చేయాలని ఆదేశించారు. పాథాలజీ విభాగానికి అవసరమైన ఆధునిక పరికరాల కొనుగోలు, విశ్రామ్ సదన్ పనుల ప్రారంభం, కమ్యూనిటీ మెడిసిన్ కార్యక్రమాలకు బస్సు టెండర్ వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే యూరాలజీ, పిడియాట్రిక్ సర్జరీ విభాగాలకు అవసరమైన పరికరాలు సమకూర్చే చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో వాష్‌రూమ్ మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని, టాయిలెట్ పనుల పురోగతిని ప్రతిరోజూ ఫోటోల ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. హాస్టళ్లలో నీటి కనెక్షన్లు, శుభ్రత, ప్లాంటేషన్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద సేవల లక్ష్యాన్ని 80 శాతానికి పెంచాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో సంబంధిత అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.



# శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న ఎస్టి కమీషన్ చైర్మన్



**శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్25,ప్రభాతవార్త :**
శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంను శనివారంనాడు ఏపి రాష్ట్ర ఎస్టి కమీషన్ చైర్మన్ సోలా బోజ్జిరెడ్డి శ్రీశైలం మల్లన్న దర్శనార్థమై శ్రీశైలంకు చేరుకున్నారు.ఆలయ రాజ గోపురం వద్ద ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకస్వాములు సాదర స్వాగతం పలికారు.తదుపరి శ్రీస్వామి అమ్మవార్ల ఉభయ దేవాలయాలను దర్శించుకోని పూజలు నిర్వహించుకున్నారు.తదుపరి అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో వేదపండితులు వేదాశీర్వచనములు వల్లించగా అర్చకస్వాములు తీర్థ ప్రసాదములు అందజేసారు.తదుపరి శ్రీస్వామివార్ల శేషవస్త్రములతో సత్కరించి లడ్డు ప్రసాదములు, శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటంను ఈఓ శ్రీనివాసరావు అందజేసారు.



**చెంచుల సమస్యలపై ఐటిడిఏలో సమావేశం:**
ఏపి ఎస్టి కమీషన్ చైర్మన్ సోలా బోజ్జిరెడ్డి శ్రీశైలం ఐటిడిఏ కార్యలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.మూడు జిల్లాలో ఉన్న చెంచుల సమస్యలను అడిగితెలుసుకున్నారు.తదుపరి చెంచులకు అవసరమైన పరికరాలను అందజేసారు.ఈ కార్యక్రమంలో సభ్యులు కాకిలక్ష్మి,మల్లేశ్వరరావు, శ్రీశైలం ఐటిడిఏ ప్రాజెకు ఆదికారి పి.వి.ఎస్.నాయుడు, ఏపిఓ సురేష్ కుమార్ తదితరులు పాల్గోన్నారు.

# సృష్టిఅంతా భగవంతుని స్వరూపమే !

**: భావించే ఉదార భావమే సనాతన ధర్మ**
**– డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తితిదే**

**పగిడ్యాల, ఏప్రిల్ 25,ప్రభాతవార్త :**
సృష్టిఅంతా భగవంతుని, స్వరూపమే భావించే ఉదార భావమే సనాతన ధర్మమనీ హిందూ ధర్మప్రచారం పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. పగిడ్యాల మండలం తూర్పు ప్రాతకోటలోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానం నందు 4రోజులగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమి కీటకాది మొదలు బ్రహ్మపర్యంతం భగవంతుడు నిండి ఉన్నాడనీ సర్వభూతముల పట్ల హిందూభావన సనాతన వైదిక ధర్మం పట్ల మాత్రమే సాధ్యమనీ వేంకటరెడ్డి అన్నారు. 3 రోజుల పాటు శ్రీమద్రామాయణం, వేంకటేశ్వర స్వామి వైభవం గురించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డి చేసిన ప్రవచనాలు స్థానిక భజన మండలిచే నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ధర్మప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకరెడ్డి, స్థానిక అర్చకులు నాగలింగమయ్య, భజన మండలి అధ్యక్షులు స్వర్ణలత, ఎల్లగౌడు, నాగరాజు, పడమర ప్రాతకోట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున టీచర్ నాగార్జగౌడు, హుశేన్, భజన బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# మార్చి 2027 నాటికి అన్నిగ్రామాల్లో రీ సర్వే పూర్తి

**నంద్యాల ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిది :**
జిల్లాఓ కొనసాగుతున్న రీ సర్వే కార్యక్రమాన్నిపకడ్బందీగా నిర్వహిస్తూవేగవంతము చేయాలని కలెక్టరు రాజకుమారి అర్డిఓలు, తహశీలుదారుల సర్వేయర్లుకు అదేశాలు జారీ చేశారు. ఈసందర్బముగాఅమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే కార్యక్రమం ద్వారా అదునాతన సాంకేతికతను వినియోగించి రైతులకు స్పష్మటమైన భూ హక్కులు కల్పించడము జరుగుతోందన్నారు. అప్రక్రియ తో భూ కబ్జాలకు పూర్తిగా అడ్డుకట్ట పడుతుందని ఒకరి భూమి మరొకరి పేరుకు మారే అవకావాలు ఉండవని స్పష్మటు చేశారు. గతంలో చోటుచేకున్న భూ వివాదాలుకబ్జాలకుస్వప్తి పలకాలనే ఉద్దుశ్యంతో ముఖ్యమంత్రి దూరదుష్టితో ఈకార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన తెలిపారు. నంద్యాల జిల్లాలో 2027 మార్చి నాటికి అన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అదేశించిటన్లు వెల్లడించారు.జల్లాలో మొత్తం 449 రెవెన్యు గ్రామాలు ఉండగా ఇప్పటి వరకు263 గ్రామ్లో రీ సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. పూర్తి చేసిన గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను త్వరితగతిన పంపిణీ చేయాలని అదేశించారు.రీ సర్వే గడవులోగా పూర్తి కావాలంటే సర్వే బృందాలు ముందస్తుగా గ్రౌండు ట్రూతింగ్ గ్రౌండు వాలిడేషన్ స్టోన్ ప్లాంటేషనన వంట పనులను ప్రణిళికాబద్దంగా చేపట్టాని కలెక్టరు సూచించారు. రైతుల బాగస్వామ్యం లేకుండా ఎట్టి పరిస్తితులో రీ సర్వే చేయకూడదని ప్రి రైతు భూమి రీ సర్వే పూర్తి కావాలంటే సంబందిత రైతు మూడుసార్లు ఈ కేవైసి పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు.అలదగే ఎక్కడా పట్టాభూములను 22ఏ కింద చేర్చకూడదని అలా చేసినట్టతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# మలేరియాను అంతం చేయడమే మనలక్ష్యం..

– వైద్యా ధికారి నాగ శ్రీజారెడ్డి..



**రుద్రవరం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** సమాజం నుంచి మలేరియాను సమూలంగా అంతం చేయడమే లక్ష్యంగా మనందరం పని చేయాలని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డా.నాగ శ్రీజారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మలేరియా దోమకాటు వల్ల వచ్చే వ్యాధి అని ఈవ్యాధిభారీన పడిన వ్యక్తికి చలి, వణుకుతూ కూడిన జ్వరం వస్తుందని ఒల్లంతా విఫరీతంగా చెమటు పడతాయని జ్వరం విడిచి విడిచి వస్తుందని తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, ఆలసట మొదలైన లక్షణాలు మలేరియా సోకిన వ్యక్తిలో ఉంటాయన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్న వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యాధికారులను సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకొని సకాలంలో సరైన చికిత్స పొందాలన్నారు. ఈరకమైన జ్వరాల భారీన పడకుండా ప్రజలు తమను తాము కాపాడుకో వాలంటే ప్రధానంగా తమ నివాసాల చుట్టు దోమలు కుట్టకుండా చూసుకోవాలన్నారు. దోమలు నీటి కుంటల్లో వున్న నీటిలో గుడ్లుపెట్టి తమ సంతతిని పెంపొందించుకుంటాయని మన పరిసరాల్లో నీటి కుంటలు లేకుండా నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. పాత టైర్లు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, పగిలిన గాజు సీసాలు, వాడకంలో లేని రోళ్లు, నీటి డ్రమ్ములు మొదలైనవి దోమల ఆవాసాలుగా ఉంటాయన్నారు. మన ఇళ్ళల్లో తప్పనిసరిగా వారానికి ఒకసారి ప్రతిశుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. డ్రమ్మ్‌ల్లో నిల్వ ఉన్న నీరుపూర్తిగా పారవేసి శుభ్రం చేసి ఆరబెట్టి తరువాత మళ్లీ తాజాగా నీరు నింపుకోవాలన్నారు. దీని వల్ల దోమల లార్వాలు నీటిలో ఉంటే నసిస్తాయన్నారు. సాయంకాలం వేళ ఇంటి పరిసర ప్రాంతాల్లో వేపాకుతో పొగబెడితే దోమలు ఆ దరిదాపులో చేరవని రాత్రిళ్ల నింద్రించు సమయాల్లో దోమతెరలు వాడాలన్నారు. ఇలా చేయడం ద్వారా దోమలు కుట్టకుండా దోమల ద్వారా వచ్చే మలేరియా డెంగ్యూ, బోదకాలు, చికెన్ గున్యా, మెదడువాపు లాంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. అలాగే ఆరోగ్యసిబ్బందితో కలిసి గ్రామంలో మలేరియా గురించి అవగాహన కల్పిస్తు ర్యాలీ నిర్వహించామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ రసూల్, మల్లేశ్వరీ, ఎఎన్ఎంలు, ఆశాలు, ఫార్మసిస్టు నరసింహారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**మంత్రాలయం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త;** మండల పరిధిలోని మాధవరం అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు సమీపంలో శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాల మేరకు. ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామానికి చెందిన తుమ్మల చంద్ర(31) అనే వ్యక్తి కర్ణాటక నుంచి స్కూటర్‌పై వస్తుండగా గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొనడంతో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించారు. మృతిదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రపంచ పశువైద్య దినోత్సవం వైద్యాధికారికి సన్మానం



**బనగానపల్లె, ఏప్రిల్ 25 , ప్రభాతవార్త:** ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (తిరేళీ) ఆధ్వర్యంలో బనగానపల్లె మండల పశువైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ ఏ.డి. మారుతి సకారం ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి శివయ్య పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పశుపోషణ రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారమని, ముఖ్యంగా మహిళల ఉపాధి, పాడి పరిశ్రమ అభివృద్ధిలో ఇది కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. పశువుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, అయితే రైతులకు సరైన పశువైద్య అవగాహన లోపం ఉందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నాల్గవ శనివారం ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని జరుపుతూ పశువైద్యుల సేవలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. 2000 సంవత్సరం నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. పశువైద్యులు జంతువుల చికిత్స, వ్యాధి నివారణ, ఆహార భద్రత, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. జిల్లాలో పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పశు దాణా సబ్సిడీ పెంచాలని, రాష్ట్రకేంద్ర బడ్జెట్లలో పశువైద్య రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశువైద్యాధికారి బ్రహ్మానందరెడ్డి, చేతివృత్తిదారుల సంఘం నాయకుడు శివానాగయ్య, రైతు గంగన్న పాల్గొన్నారు.

## నూతన మండల విద్యాధికారులను సన్మానించిన పార్ట్ టైమ్ ఇంస్ట్రక్టర్లు



**ఆదోని, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ఆదోని మండలం ఇటీవల నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మండల విద్యాధికారి 1 ఇంద్రవతిని గవర్నమెంట్ బాలికల ఉన్నత పాఠశాల నందు, మండల విద్యాధికారి 2 రంగన్న ను మండల విద్యాధికారి కార్యాలయం నందు ఆదోని మండల సమగ్రశిక్ష పార్ట్ టైమ్ ఇంస్ట్రక్టర్ ఫెడరేషన్ 588/2013 యూనియన్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలసి శాలువ, దండలతో ఇరువురిని ఘనంగా సత్కరించారు.మండల విద్యాధికారి 2 రంగన్న మాట్లాడుతూ పిఆర్టీస్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు యన్.కీర నాయకులు విజయమోహన్, సత్యనారాయణ, బాలు, వరప్రసాద్, శ్యామల, ఇందిర, సాజిదాసుష్మ, బసప్ప మండల విద్యాధికారులిరువురికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పోరుబాట నిరాహార దీక్షలు..




**చాగలమర్రి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ఉపాధ్యాయుల సమస్యల కోసం ధర్నాచౌక్ విజయవాడ లో నిర్వహిస్తున్న నిరాహార దీక్షలో చాగలమరి ఎస్.టి.యు సంఘం నాయకులు శనివారం పాల్గొన్నారు.వారు శరవాణిలో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం విజయవాడలో నిర్వహిస్తున్న నిరాహార దీక్షలో పాల్గొన్నామని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలు తీర్చేంతవరకు పోరాబాట ఆగదని ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్.టి.యుచాగలమర్రి మండలం ఉపాధ్యాయులు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ ఆజాం బేగ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీ పి శివశంకర్, జిల్లా అదనపు కార్యదర్శి శ్రీ.సి.ఉస్మాన్ సా.మండల సీనియర్ నాయకులు శ్రీ టి సంజీవరెడ్డి మరియు శ్రీ మహమ్మద్ గౌస్, మండల అధ్యక్షుడు గురు చంద్రుడు గారు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మహబూబ్ హుస్సేన్, ఆళ్లగడ్డ ఆర్థిక కార్యదర్శి శ్రీ గౌస్ అహ్మద్ పాల్గొన్నారు.

## ఘనంగా జలాభిషేకం, కలశ ప్రతిష్టాపన కార్యక్రమం

**కౌతాళం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** కౌతాళం మండల కేంద్రమైన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం పక్కన ఉన్న శ్రీ వాసవి నగరేశ్వర కళ్యాణ మండపంలో ఉత్సవమూర్తికి జలాభిషేకం మరియు కలశ ప్రతిష్టాపన కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌతాళం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు హెచ్. రాఘవేంద్ర శెట్టి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగి, భక్తులకు ప్రసాదం అందించారు.

## మలేరియా రహిత సమాజం నిర్మిద్దాం..



**డోన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** భారతదేశంలో మలేరియా రహిత సమాజం 2030 నాటికి ప్రకటించాలని ప్రభుత్వం ధ్యేయంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినాన్ని పురస్కరించు కోవడం జరుగుతుందని సబ్ యూనిట్ అధికారి ఎం రాజశేఖర్ రెడ్డి అన్నారు శనివారం పట్టణంలోని యూపీ హెచ్ సి పాతపేట రోకలి బండ సత్రం లలో మలేరియా రహిత సమాజం కోసం వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు ఈ ర్యాలీని ఉద్దేశించి వారు మాట్లాడుతూ దోమలపై అవగాహన కల్పిస్తూ ప్రజలకి తెలియజేయాలని వైద్యాధికారులకు తెలియజేశారు అదే విధంగా గృహాల మధ్య డ్రమ్ములు గచ్చులు నీటి తొట్లు శుభ్రంగా ఉంచుకోవడం పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారణ చేయవచ్చునని తెలియజేశారు దోమల వల్ల మలేరియా జ్వరాలు రావడం జరుగుతుందన్నారు కావున మలేరియా పై ప్రజలు కు అవగాహన కల్పించడం మన బాధ్యతని పేర్కొన్నారు మలేరియా గురించి మండల పరిధిలోని కొత్త బురుజు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రామ్ భూపాల్ హెల్త్ సూపర్వైజర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కొత్త బురుజు గ్రామంలో ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు దోమ పుట్టరాదు దోమ కుట్టరాదు దోమతెరలు వాడండి పరిసరాలను శుభ్రంగా ఉంచండి అంటూ ర్యాలీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు వైద్య సిబ్బంది వెంకటలక్ష్మి నాగరత్న రాజేష్ కృష్ణ వెంకట కుమార్ రెడ్డి ప్రణీత్ సుజాత సంధ్య ధనలక్ష్మి నీలిమ అనుపుర చంద్రకళ మధుసూదన్ రావు అమర్నాథ్ శ్రీ గౌరీ చంద్రకళ కళావతి సుజాత సుమలత ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆర్థిక సహాయం



**పెద్దకడబూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబలం గ్రామానికి చెందిన మంగలి గాజలింగ అనే యువకుడు రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు మరణించారు విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి వెంటనే స్పందించి, మృతుని కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ. 10,000/ ఆర్థిక సాయాన్ని ప్రకటించారు శనివారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యులు ఆర్. పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ బి. రామ్మోహన్ రెడ్డి, మరియు మంత్రాలయం నియోజకవర్గం బూత్ కన్వీనర్ బి. చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో ఆర్థిక సాయాన్ని మంత్రాలయం నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు కేపీ. యల్లప్ప, పార్టీ మండల కార్యదర్శి చెవుల లక్ష్మన్న ఆధ్వర్యంలో మృతుని కుటుంబ సభ్యులకు నగదును అందచేశారు పార్టీ ఎల్లవేళలా వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సోమప్పదని, లింగన్న గౌడ్, మదిరి రాముడు, ముస్లిం వలి భాషా, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ హరిజన బొడ్డన్న, బీసీ సెల్ ప్రెసిడెంట్ బోయ చిన్న కడబూరి, కందనాతి మహాదేవ, గోసిలి చిన్న మహాదేవ, పోతురాజు నాగరాజు, బోయ భాస్కర్, మండల వాలంటీర్స్ విభాగం అధ్యక్షులు కమ్మరి నరసింహ ఆచారి, పాల్గొన్నారు.

## మండల కన్వీనర్ ను సన్మానించిన వెలుగు అధికారులు



**చిప్పగిరి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** చిప్పగిరి మండల టిడిపి కన్వీనర్ కొండా పురుషోత్తమును వెలుగు సీసీలు లక్ష్మన్న, శ్రీనివాసులు వివోఏ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ కొండా పురుషోత్తం విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఆలూరులో టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి చేతుల మీదుగా వివోఏ సంఘాల మహిళలకు ప్రభుత్వం అందజేసిన 5జి స్మార్ట్ ఫోన్లను అందజేశారు. పాల్గొన్న జిల్లా జడ్పిటిసిల సంఘం మాజీ అధ్యక్షులు ఏరూరు మీనాక్షి నాయుడు, బెల్డోన సొసైటీ బ్యాంక్ చైర్మన్ కొండా రామాంజనేయులు, టిడిపి మండల కన్వీనర్ కొండా పురుషోత్తం పాల్గొన్నట్లు చెప్పారు. 5జి స్మార్ట్ ఫోన్ల పంపిణీతో వివోఏల సేవలు మరింత వేగవంతం కానున్నాయని,అభివృద్ధిని ఇంటికి చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వివికేలు వెంకట్రాముడు, పుల్లయ్య, పెద్దన్న, రాము, అకౌంటెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

## మలేరియా రహిత సమాజమే మన లక్ష్యం



**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 25, ప్రభాతవార్తః** గ్రామాల్లో ప్రజలు, చిన్నారులు మలేరియా, డెంగీ, మెదడువాపు వంటి ప్రమాదకర వ్యాధులకు గురికాకుండా ప్రజల్లో అవగాహన కల్పించి వారిని కాపాడటమే మనలక్ష్యమని డా.లిఖీత్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అహోబిల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డా.లిఖీత్‌రెడ్డి, డా.శిరిషాలు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండడం వల్ల గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు దీర్ఘకాలిక వ్యాధులతో చికిత్సలు పొందుతున్న వృద్దులు జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమలు కుట్టడం వల్ల వచ్చే ప్రమాదకర మలేరియా, డెంగీ జ్వరాలు, వ్యాధులు లక్షణాలు వివరించి తగు జాగ్రత్తలు పాటించేలా చూసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి దోమల నియంత్రణకు తమవంతు కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు, ఈసమావేశంలో కమ్యూనిటీ హెల్త్ అఫీసరు సుగుణ, డిప్యూటి హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి వెంకటరమణ, ఆరోగ్య సహాయకుడు రామారావు, స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ జ్యోతి, సుశీల, పద్మజ, ఆశోక్, ఆరోగ్యకార్యదర్శులు లక్ష్మీకళ, హేమలత, వెంకటమ్మ వుశేన్‌బీ, రాణి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి శాప్ లీగ్ బాక్సింగ్ పోటీలకు ఆత్మకూరు నుంచి II మంది విద్యార్థులు ఎంపిక



**ఆత్మకూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి శాప్ లీగ్ బాక్సింగ్ పోటీల్లో ఆత్మకూరు కేవీకే స్టేడియం విద్యార్థులు పాల్గొని 11 మంది రాష్ట్రస్థాయి శాప్ లీగ్ పోటీలకు ఎంపిక అయ్యారని ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పసిఫిల్ మున్నా తెలిపారు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల విశాఖపట్నంలో జరిగే శాప్ లీగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు శుక్రవారం పట్టణంలో ఎంపికైన క్రీడాకారులకు కెవికె స్టేడియం లో అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరించాలనే సంకల్పంతో శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే.. బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఉన్నారని ప్రతిఒక్కరు వచ్చే నెల 1 వ తేదీ నుంచి మొదలయ్యే సమ్మర్ క్యాంప్ (వేసవి క్రీడా శిక్షణలు తీసుకొని క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు) బాక్సింగ్ విద్యార్థులకు మంచి శిక్షణ ఇస్తున్నా శిక్షకుడు ఉపేంద్రను అభినందించారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్‌ను మర్యాదపూర్వకంగా..

**ఆత్మకూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలో బిజెపి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ప్రజా అధినేతకు శుక్రవారం అమరావతిలోని మాధవ్ నివాసంలో జరిగిన ఈ భేటీలో పలు రాజకీయ అంశాలు చర్చించుకున్నారు ముందుగా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మాధవ్‌ను మోమిన్ షబానా శాలువాతో సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గంలో బిజెపి పార్టీలో జరిగే తాజా రాజకీయ పరిస్థితులు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్ర శిక్షణ కార్యక్రమం, మన ఊరు మన జెండా ఆత్మకూరు పట్టణంలో చలివేంద్రం ఏర్పాటు , స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్ ) వంటి కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేయడంతో, రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ , జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా ని అభినందించారు. పలు కీలక అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు ఆమె పేర్కొన్నారు. పార్టీ బలోపేతం నియోజకవర్గ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం ప్రజా సమస్యల పరిష్కారంపై రాష్ట్ర అధ్యక్షుడికి ఆమె చెప్పినట్లు తెలిపారు.

## బ్రహ్మంగారి కాలజ్ఞానం ప్రపంచానికి ఆదర్శం..



**బనగానపల్లె, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** మండలంలోని పలుకూరు గ్రామంలో స్థానిక రామాలయంలో బ్రహ్మం గారి ఆరాధన ఉత్సవాల సందర్భంగా బ్రహ్మంగారి కాలజ్ఞాన విశిష్టతపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీ జె.కె.ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీ జె.ఎస్.ఎస్ బ్రహ్మనంద చారి ఆధ్వర్యంలో జరిగింది. మొదటగా బ్రహ్మంగారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆలయ పూజారి శ్రీనివాసులు పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సదస్సు లో బ్రహ్మనంద చారి మాట్లాడుతూ, బ్రహ్మంగారి కాలజ్ఞానం ప్రపంచానికి ఆదర్శమని పేర్కొన్నారు. భూత, భవిష్యత్, వర్తమాన కాలాలను వివరిస్తూ ప్రజలకు మార్గదర్శనం చేసిన మహనీయుడు వీరబ్రహ్మేంద్రస్వామి అని కొనియాడారు. అలాగే, వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు, జయంతులను ప్రభుత్వపరంగా నిర్వహించాలని కోరారు. జిల్లాకు లేదా విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రవ్వల కొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, చింతమాను మఠం మరియు నేల మఠాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బ్రహ్మంగారి మఠాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, ప్రసాద్ పథకం కింద రూ.150 కోట్లు కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆలయ పూజారి శ్రీనివాసులు, నటలయ్య, గాలి అన్న, దూదేకుల ఉసేని, కుమ్మరి వెంకటేశ్వర్లు, నర్సమ్మ, కరెంటు రాజు, భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌కు ఆర్థిక సహాయం



**బనగానపల్లె, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** పట్టణంలోని రంగరాజు వీధికి చెందిన సయ్యద్ అన్వర్ హుస్సేన్ అనే ప్రైవేట్ బస్ డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. తన ఇంటి ముందు నిలబడి ఉన్న సమయంలో ఒక ఆటో అదుపుతప్పి ఆయనపైకి దూసుకురావడంతో కాలికి ఫ్రాక్చర్ అయింది ఈ సమాచారంను తెలుసుకున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి స్పందించారు. బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ తరపున రూ.10,000 ఆర్థిక సహాయం అందజేసి, బాధితుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



**కొత్తపల్లి, ఏప్రిల్ 25, ప్రభాతవార్తః** ఆలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడివో మేరీ సూచించారు. ఆమె శనివారం జలధార, జలహారి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం కొత్తపల్లి గ్రామ శ్రీతాండవ మల్లేశ్వరస్వామి ఆలయ కోనేరును ఏపీవో విమలమ్మ, ఇరిగేషన్ ఏఈ శివతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జలధార, జలహారతి కార్యక్రమంలో భాగంగా కోనేరు శుభ్రం చేసేందుకు ఉపాధి హామి పథకం ద్వారా కోనేటిలో పాత నీటిని మోటార్ల సహాయంతో పూర్తిగా బయటకు పంపి అడుగున పెరుకుపోయిన బురద పాచి మరియు చెత్త చేదారాన్ని తొలగించాలన్నారు. నీటిని సంరక్షించేలా కోనేటిని నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలా చేయడం ద్వారా నీటి నిల్వను సంరక్షించుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో కార్తీక్, పంచాయితీ కార్యదర్శి చిన్నస్వామి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



**కర్నూలు మున్సిపల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్తః** పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని మెడికల్ కళాశాల వద్ద వున్న పెట్రోల్ బంకు ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగరకార్యదర్శి బిసన్నలు మాట్లాడుతూ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా నాలుగురోజులుగా పెట్రోల్ దొరక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే జిల్లా యంత్రాంగం మాత్రం పెట్రోల్, డీజిల్ కొరత లేదని ప్రకటనలకే పరిమితమవుతున్నారని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ కొరత వల్ల చాల మంది డెలివరీ బాయ్స్, అఫీసులకు వెళ్లె వారు ఆటో డ్రైవర్లు ఇళ్ళకే పరిమితం కావాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. పెట్రోల్, డీజిల్ కొరతలేదనేది నిజమైతే వాటిని నిల్వ ఉంచుకొని కృత్రిమ కొరత సృష్టిస్తు బ్లాక్‌లో అధికరేటుకు అమ్ముకునేవారిపై క్రిమినల్ కేసు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి ఆశోక్, ఏఐవైఎఫ్ నగర నాయకులు చంటి, కుమార్, రాజేష్, కాశీం, రంజిత్ బాష, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథలకు అండగా నిలిచిన దంపతులు



**ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఉప్పర నాగరాజు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె తేజస్విని, అల్లుడు నవీన్ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం తేజస్విని తన భర్త నవీన్, ఇద్దరు పిల్లలతో కలిసి ప్రత్యేక ఆటోలో దుప్పట్లు, దుస్తులు, గొడుగులు తీసుకుని పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో తిరుగుతూ అనాథలకు పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్, మిలటరీ కాలనీ, ఎంజీ పెట్రోల్ బంక్ సర్కిల్, సోమప్ప సర్కిల్, సోమప్ప నగర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్కిల్, శివ సర్కిల్, గోనెగండ్ల రోడ్డు, అన్నమయ్య సర్కిల్ ప్రాంతాల్లో రోడ్లపై జీవిస్తున్న నిరాశ్రయులకు అవసరమైన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మానవత్వాన్ని చాటుకున్నారు. దుస్తుల పంపిణీ సందర్భంగా తండ్రిని తలుచుకుని తేజస్విని భావోద్వేగానికి గురయ్యారు. "మా నాన్న ఎంతో ప్రేమగా పెంచి ఉన్నత చదువులు చదివించారు. ఆయన మరణం మాకు తీరని లోటు. ఆయన జ్ఞాపకార్థం అనాథలకు సేవలు చేయాలని సంకల్పించాం" అని తేజస్విని, నవీన్ తెలిపారు.

## సమయాల్లో మార్పులు-రైతులకు సూచనలు

**కర్నూలు అర్బన్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో రైతుల సౌలభ్యార్థం వ్యవసాయ మార్కెట్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రైతు సోదరులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు 27వ తేదీ నుండి ఉదయం 9.00 గంటలలోపు తీసుకువచ్చి లాట్ ఐడీలు పొందాలని సూచించింది. మార్కెట్ యార్డులోని కమీషన్ ఏజెంట్లు, వ్యాపారస్థులతో చర్చించిన అనంతరం టెండర్ డిక్లరేషన్ సమయాలను ఈ విధంగా నిర్ణయించారు. మొక్కజొన్నలు, పూల విత్తనాలు, ఆముదాలు, శనగలు, సద్దలు, మినుములు, కొర్రలు – ఉదయం 11.30 గంటలకు వేరుశనక్కాయలు, కందులు, ఉల్లిగడ్డలు, వాము – మధ్యాహ్నం 12.00 గంటలకు ఎండుమిర్చి – మధ్యాహ్నం 12.30 గంటలకు ఇతర సరుకులు – మధ్యాహ్నం 1.00 గంటకు వ్యాపారస్థులు నిర్ణయించిన సమయాలను గమనించి టెండర్లు వేయాలని అధికారులు సూచించారు. అలాగే రైతులు కూడా ఈ సమయాలను తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్. జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

## సిఐటియు నాయకుడు నాగరాజుకు ఘన నివాళులు



**ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నాయకుడు పి.నాగరాజు అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన ఎమ్మిగనూరు మండలం ఏనుగుబాల గ్రామంలో శనివారం నిర్వహించారు. వివిధ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. నాగరాజు విలేజ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్‌ను స్థాపించి, జిల్లాలో కార్మిక హక్కుల కోసం నిరంతరం కృషి చేశారు. విలేజ్ ఎలక్ట్రికల్ వర్కర్‌గా ప్రారంభించి లైన్మెన్ స్థాయి వరకు ఎదిగి, కార్మిక ఉద్యమాన్ని అంచెలంచెలుగా నిర్మించారు. విద్యుత్ సంస్థలో కార్మికుల సమస్యల పరిష్కారంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. వేతనాలు, ఇతర ప్రయోజనాల కోసం అధికారులతో పోరాటపూర్వకంగా చర్చలు జరిపి, కార్మికులకు న్యాయం చేయడంలో ముందుండేవారు. ఆయన మరణం విద్యుత్ ఉద్యోగులతో పాటు మొత్తం కార్మిక ఉద్యమానికి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు నాగరాజు ఆశయాలను సాధించేందుకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అంత్యక్రియల్లో సిఐటియు ఎమ్మిగనూరు మండల, పట్టణ అధ్యక్షుడు పి. గోవిందు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కర్రెన్న, రమేష్ బాబు, భీమేష్, ప్రవీణ్, జావిద్, నాగన్న, అనిల్, భాస్కర్, యూనిస్ భాష, యుటిఎఫ్ నాయకులు దావీదు, శాంతిరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. దేవ సహాయం తదితరులు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బి. రామాంజనేయులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

## వర్షపు నీటిని నిల్వ చేసేందుకు పుష్కరిణి తనిఖీ



**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 25, ప్రభాతవార్తః** జలధార, జలహారతిలో భాగంగా ఆళ్లగడ్డ మండల పరిధిలోని కోటకందుకూరు ట్యాంకును అలాగే ఆర్ కృష్ణాపురం గ్రామ పంచాయితీ పరిధిలోని రామతీర్థంలో నరసింహాస్వామి పుష్కరిణిని ఎంపీడివో నూర్జహాన్ శనివారం తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జలధార, జలహారతి కార్యక్రమం ద్వారా వర్షపు నీటిని గరిష్టంగా నిల్వచేసి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు రాబోయే వర్షాకాలానికి ముందుగానే నీటి భద్రత కల్పించడమే జలధార ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ ఎఈ రాంప్రసాద్, పీఎస్‌లు సుదర్శన్‌రెడ్డి, అబ్దుల్ అజీత్, నరసింహాస్వామి, ఆలయ అధికారులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## మలేరియాపై ర్యాలీ



**మహానంది, ఏప్రిల్ 25, ప్రభాతవార్తః** మహానంది మండల పరిధిలోని తిమ్మాపురంలో మలేరియా వ్యాధిపై వైద్యులు ర్యాలీ నిర్వహించారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించినట్లు వైద్యులు భగవాన్ దాస్, వేణులు తెలిపారు. మలేరియా వ్యాధి ఆడ అనాఫిలిస్ దోమకాటు వల్ల వస్తుందని ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలపై దోమల గుడ్లు పెట్టకుండా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీటిపై వేస్ట్ ఇంజిన్ ఆయిల్, కిరోసిన్ ఆయిల్ చల్లించాలని తెలిపారు. మురుగునీటి కాల్వలపై యాంటి లార్వల మందులు చల్లించాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించినట్లయితే ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉచితంగా రక్తపరీక్ష చేయించుకొని వ్యాధి నిర్ధారణ అయితే చికిత్సతో వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఉశేన్‌రెడ్డి, పిహెచ్ ఎన్ అమినాబీ, నరసింహారావు, శివ దుర్గాదేవి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

**పాములపాడు, ఏప్రిల్ 25, ప్రభాతవార్తః** అదనపు కట్నం వేధింపుపై 6 మందిపై కేసు నమోదుచేసినట్లు పాములపాడు ఎస్ఐ తిరుపాలు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామానికి చెందిన స్రవంతిని బనగానపల్లె పట్టణానికి చెందిన ఈడిగే అరుణ్ కుమార్‌తో వివాహం అయింది. కట్నం కింద రూ.5 లక్షలు, 20 తులాల బంగారు ఇచ్చారు. అయినప్పటికి అదనపు కట్నం తేవాలని భర్తతో పాటు కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేస్తున్నారని స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గృహ హింస చట్టం (498) కింద అరుణ్‌కుమార్, మహేష్, సునీత, వాణి, సురేష్, తిరుపాలుపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# నంద్యాలలో ప్రభుత్వం భూములన్ని హారతేనా..!?

**: మొన్న తెలుగు దేశం పార్టి కార్యాలయానికి.. నేడు యంఐఏకు..!**

**: నంద్యాల నడిబొడ్డున కోట్లవిలువ చేసే భూమి యంఐఏకు**

**నంద్యాల , ఏప్రిల్ 25, ప్రభాతవార్త ప్రతినిధి :** నంద్యాల పట్టణంలో ప్రభుత్వం భూములన్నీ మెల్ల మెల్లగా హారతికర్పూరములాగా హరించి పోతున్నాయి.వైసిపి హయాంలో మెడికల్ కాలేజి నిర్మాణము పేరుతో వ్యవసాయ కళాశాలము భూములు హారతి పాడారు. అనంతరము కూటిమి ప్రభుత్వంలో రైతులకు సంబందించినమార్కెట్ యార్డు భూమిని పార్టికార్యాలయంకు లీజు పేరుతో హారతీ,. కాగా నేడు యంఐఎ కార్యాలయానికి ఏకంగా నంద్యాల నడిబొడ్డున మున్సుపార్టికి చెందిన కోట్లు విలువ చేస్తే ప్రభుత్వం స్థలముఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు తెలుస్తోంది నాడు వైసిపి ప్రభుత్వం రైతుల నూతన వంగడాలు సృష్టించేవ్యవసాయా పరిశోదరన భూములను అక్రమించి మెడికల్ కాలేజిలు నిర్మాణము చేపట్టారు.నాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగు దేశం పార్టి అరచి గీపెట్టారు. ప్రభుత్వం భూములను నాశనము చేయద్దని ముఖ్యంగా రైతులకు చెందినభూములను అక్రమించరాదని గోగ్గలు పెట్టారు.అయితే నేడు అదే తెలుగు దేశం పార్టి అదికారములోకి వచ్చి రాగనే వారు కూడా రైతులసం బందించిన భూములపై కన్నెశారు. నేడు కూటమి ప్రభుత్వం అదే రైతులకు సంబందించిన మార్కెట్ యార్డు స్థలాన్ని ఏకంగా పార్టికార్యాలయానికి స్వాదీనము చేసుకోవడము జరుతోంది,. అందే రెండు రెండే ఎవరు ఎవరికి తక్కువ కాదు,వరు రైతుల,వారు రైతులు భూములను లాకున్నారు,. వారైన రైతులు భూములను గుంజకుని ఎందరో బావితరాలు వైద్యుల విద్యర్థులకు బాట వేస్తే వారు మాత్రమే పార్టి కార్యాలయంకు లాగుకోవము ఏమాటని సామాన్య జనం ప్రశ్నిస్తున్నారు తెలుగు దేశ పార్టి అదే కాకుండ దమరోక అడుగు ముందుకు వసి కోట్లు వివుల చేసే మున్సుపాల్టి స్థలాన్ని యంఐఎకు అప్పగించాలని నిర్ణయించడము పెద్ద చర్చ జరుగుతోంది. కోట్లు కోట్లు పెట్టి భవంతులు నిర్మాణము చేస్తున్న డాక్టర్లు వారి కార్యాలయానికి ఎందుకు లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసుకోలేరనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.మొత్తం మీద వారు వీరు కలిసి విలువైన ప్రభుత్వం భూములను అప్పనంగ దారదత్తం చేస్తున్నారని చెప్పక తప్పదు. వారు వీరు అక్రమణలు సరే ఎన్నికలు సమయంలో ప్రేస్ క్లబ్ నిర్మాణమునకుస్థలం కేటాయిస్తామిన చెప్పిన నాయకులు వాటిని గాలిక వదలి వేశారు.

# వెండి దొంగలు ముగ్గురు అరెస్ట్



**: 30 కేజీల వెండి స్వాధీనం**

**డోన్ ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** డోన్ పట్టణ సమీపంలోని న్యూ భారత్ దాబా దగ్గర 18 తేదీ ఉదయం 6 గంటల 15 నిమిషాలకు నిలిచి ఉన్న బస్సులో నుండి దాదాపు 30200 గ్రాములు వెండి దొంగలించబడినట్లు ఫిర్యాదారుడు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాది చేశారు వారి ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డోన్ డి.ఎస్.పి పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ ఇంతియాజ్ భాష సిసిఎస్ సిఐ సురేష్ కుమార్ ను ఎస్సైలు శరత్ కుమార్ రెడ్డి నరేంద్ర కుమారులు లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి మధ్యప్రదేశ్ లోని ధర్మపురి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 66 లక్షల 62,000 విలువచేసే వెండిని స్వాధీనం చేసుకోవడం అయినదని డోన్ డిఎస్పి పి శ్రీనివాసులు తెలిపారు వివరాలకు వెళితే ఈనెల 17వ తేదీ తమిళనాడు సేలం వద్ద ఫిర్యాది అయినా ముహ్వాజ్ ఖాన్ వద్ద వెండి అభరణాలు తీసుకొని వస్తుండగా ఆయన పైన నిగవుంచి మధ్యప్రదేశ్ కు చెందిన చోటు ది వార్ రాజేష్ చౌహాన్ మన్సూర్ ఖాన్ ముగ్గురు కలిసి వెండి ఆభరణాలు 18వ తేదీ న్యూ భారత్ దాబా దగ్గర బస్సు ఆపి దాబాలో టీ తాగడానికి వెళ్లిన ప్యాసింజర్లను గమనించి మధ్యప్రదేశ్ చెందిన ముగ్గురు వ్యక్తులు మూవాజ్ ఉంచిన బ్యాగును గుర్తించి బ్యాగును దొంగలించినట్లు సీసీ కెమెరాలు ఫుటేజ్ వల్ల నిందితులను పట్టుకోవడం జరిగిందని డిఎస్పీ తెలిపారు పట్టణ సీఐ ఇంతియాజ్ భాష సిసిఎస్ సిఐ సురేష్ కుమార్ ఎస్ఐలను కానిస్టేబుల్ రికవరీ చేయడం వల్ల అభినందించారు

## ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కు అవార్డు



**కర్నూలు అర్బన్ 25 ప్రభాతవార్త :** కర్నూలు బిక్యాంప్‌లోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. నాగస్వామి నాయక్‌కు ఆదర్శ విద్యారత్న సమ్మాన్ – 2025" పురస్కారం లభించింది. విద్యా రంగంలో ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ బ్లూ స్టార్ ఈవెంట్స్ సంస్థ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి, పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా సర్టిఫికేట్ ఆఫ్ అచీవ్మెంట్‌ను కూడా అందించారు. విద్యార్థుల అభివృద్ధి, వృత్తి విద్యపై అవగాహన కల్పించడంలో డా. నాగస్వామి నాయక్ కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమేష్, విజయశేఖర్, ఉల్గోజీరావు ఆయనను అభినందించారు.

## అందరి సహకారంతో నగరాన్ని తీర్చిదిద్దుతాం

**– నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు మున్సిపల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్తః** ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి భాగస్వామ్యంతో నగరాన్ని అన్నివిధాలుగా తీర్చిదిద్దుతామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. శనివారం వెంకటరమణ కాలనీలో నగరపాలక కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పన, పారిశుధ్యం, పచ్చదనం ప్రజా సమస్యలు పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆస్తిపన్ను వసూలుపై ప్రత్యేక దృష్టిసారించామని కార్పొరేషన్ నూతన కార్యాలయ పనులను పునః ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలు సైతం సహకరించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపులపై 5 శాతం రాయితీ. బకాయిలపై ఏకమొత్తంలో చెల్లింపులపై 50 శాతం వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వీయ గణనకు ప్రజలు సహకరించాలని హెచ్‌టిటిపిఎస్ః //ఎస్ఈ.సీఈఎన్ఎస్‌యుఎస్. జీఓవిఇన్.ఇన్ లింకు ద్వారా ఏ ప్రిల్ 30 లోపు వివరాలు నమోదు చేసుకోవాలని మే 1 తర్వాత ఎను ¡్యమరేటర్ వచ్చినప్పుడు తప్పులుంటే సరిచేసుకోవచ్చన్నారు.

## సత్ర నిర్వహాకులు సేవా దృక్పదంతో సేవలను అందించాలి:ఈఓ



**శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్25, ప్రభాతవార్త :** శ్రీశైలక్షేత్రంలో ఉన్న అన్ని వర్గాలకు చెందిన సత్ర నిర్వహాకులు సేవా దృక్పథంతో భక్తులకు సేవలందించాలని దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు కోరారు.శనివారంనాడు పరిపాలన భవన సమావేశ మందిరంలో సత్రాల నిర్వహాకులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ వేసవి తీవ్రత కారణంగా అన్ని సత్రాల వారు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.శుచి,శుభ్రతలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.పర్యావరణ పరిరక్షణలో బాగంగా శ్రీశైలక్షేత్రాన్ని ప్లాస్టిక్ రహిత క్షేత్రంగా ప్రకటించడం జరిగిందన్నారు.ముఖ్యంగా స్వచ్ఛ శ్రీశైలం పట్ల దేవస్థానం ప్రత్యేక శ్రద్ద కనబర్చాలన్నారు.దేవదాయ ధర్మదాయ చట్టంను ఉల్లగించరాదని పేర్కన్నారు.ఈ సమావేశంలో రెవిన్యూ విభాగం ఏఈఓ శ్రీనివాసరెడ్డి,పిఆర్ఓ టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు యం.శ్రీనివాసరావు,తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బార్లలో తనిఖీలు

**కర్నూలు హాస్పిటల్ ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** కర్నూలు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కర్నూలు మున్సిపాలిటీ పరిధిలోని వైన్ షాపులు మరియు బార్లలో తనిఖీలు ముమ్మరం చేయడం జరిగినది. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పి శ్రీదేవి మరియు జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎం సుధీర్ బాబు వేరువేరుగా షాపులు మరియు బారులను తనిఖీ చేసి మద్యం యొక్క నాణ్యతను పరిశీలించి మద్యం బాటిల్ల యొక్క స్కానింగ్ ను నిశితంగా పరిశీలించడం జరిగినది ప్రతి ఒక్క బాటిల్ సురక్ష ఆప్ ద్వారా స్కాన్ చేయవలెనని సమయపాలన పాటించవలనని తెలియజేయడం జరిగినది. ఇందు వెంట ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ చంద్రహాస్ ఈఎస్టిఎఫ్ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# మార్కెట్ యార్డులో ఉన్న స్థలము రైతులకు అవసరం లేదటా..?

**నంద్యాల ,ఏప్రిల్ 26,ప్రభాతవార్తప్రతినిధి :** నంద్యాల మార్కెట్ యార్డులో స్థలాము వృదాగా పడి ఉందని అది రైతుకలు అంత ఉపయోకరముగా లేదని మార్కెట్ యార్డు జేడి రామాంజనేయుఉల సంచలన వాఖ్యలు చేశారు. శనివారము మార్కెట్ యార్డు జేడి రామాంజనేములు నంద్యాల మార్కెట్ యార్డు జేడి రామాంనేయులు పరిశీలించారు. నంద్యాలలోని నూనెపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డు 2 ఎకరాలు స్థలము తెలుగు దేశం పార్టికార్యాలయంకు కేటియించిన విషయం విదితమే ఈ కేటాయింపు రాష్ట్ర వ్యాప్తంగ పెద్ద దుమారము రేపుతుంది.రైతుల కోసం వినియోగించాల్సి నఅత్యంత విలువైన యార్డు స్థలాన్నిఇ తెలుగు దేశం పార్టి కార్యాయానికి కేటాయించాలని ప్రతి పాదనలపై విమర్శఉల వెళ్ల వెత్తాయి నంద్యాల జిల్లా అద్యక్షలు కోరిన మేరకు నూనెపల్లె మార్కెట్ స్తలాన్ని పార్గి కార్యాయానికి కేటాయించాలని జిల్లా కలెక్టరు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రక్క యలో బాగంగా శనివారము వ్యవసాయ మార్కెట్ జాయింట్ డైరెక్టర్లు (జేడి) రామాంజ నేయులు మార్కెట్ యార్డు లో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అక్కడున్న నిర్మాణాలను తొలగింపు స్థలం విలువ తదితర అంశాలపై ప్రభుత్వానికి పూర్తి నివేదికసమర్పిస్తాని ఈ



సందర్భముగా జేడి వెల్లడించారు. అనంతరము అక్కడు ఉన్న విలేకర్లు జేడి రామాంజనేయులుతో మాట్లాడుతూ రైతుల అబివృద్ధికి కేటాయించిన విలువైన భూమిని ఒక పార్టి కార్యాలయానికి ఎలా కేటాయిస్తారు? దీనిపై రైతుల నుండి వస్తున్న అభ్యంతరాలుకు మీ సమాదానము ఏమిటిని ప్రశ్నంచగా జేడి అశ్యర్యకరమైన సమాదా నము ఇచ్చారు జేడి సమాదానము ఇస్తూ ప్రస్తుమతు నూనెపల్లె మార్కుట్ యార్డులోని సదరు స్థం రైతులకు పెద్దగ ఉపయోగపడటము లేదు. అందుకే కార్యాలయానికి కేటియించేందుకు నివేదికలు పంపుతున్నాం అయితే రైతులకు అవసరమైన మిగిలిన స్థలాన్ని వారి కోసం వినయోగిస్తామన్నారు. రైతల అవసరాల కోసం నిర్మించిన మార్కెట్ యార్డు స్థలం..అనవసరమని ప్రభుత్వం ఉన్నతాదికారి వ్యాఖ్యానించడముపై రైతుల సంఘాలు మండిపడుతున్నాయి. భవిషత్తులో మార్కెట్ విస్తరణకు ఉపయోపడే స్థలాన్నిరాజకీయ కార్యాలయాలకు అపక్నంగా దారాదత్తం చేయడము ఎంత వరకు సమంజమని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

# పేదరిక నిర్మూలన దిశగా కూటమి ప్రభుత్వం.

**: వివోఏ లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి.**

**: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆది కృష్ణమ్మ.**



**ఆదోని ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** రాష్ట్రంలో పేదరిక నిర్మూలన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆది బ్రిడ్జి కృష్ణమ్మ అన్నారు. శనివారం ఆదోని నియోజకవర్గం లోని వివోఏలకు వెలుగు కార్యాలయం నందు స్మార్ట్ ఫోన్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షురాలు ఆదికృష్ణమ్మ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హాజరై వివో ఏలకు స్మార్ట్ ఫోన్లు పంపిన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదోనిలో పేదరిక నిర్మూలన దిశగా మరో కీలక అడుగు ఏపీ కూటమి ప్రభుత్వం వివోఏలకు స్మార్ట్ఫోన్లు పంపిణీ చేయడం జరిగిందని వారన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదరికన్ని ధనికుడిగా చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అందులోని భాగంగా మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి మహిళ స్వతగా వ్యాపారం చేసుకొని జీవనం కొనసాగించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం శ్రీనిధి ద్వారా లోన్లను అందజేస్తుందని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురువ కార్పోరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ. ఎక్స్ ఎంపీపీ బడాయి పంపాపతి. ఎక్స్ ఎంపీపీ మురళి. మహాదేవ. ఎంపీడీవో నాగరాజు స్వామి.ఏపీఎం వీరన్న. వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ. కేసులలో రాజీ పడే ప్రసక్తే లేదు..!?

**: గ్రామీణ ప్రాంతాలలో భూ సమస్యలపై తగాదాలు పడితే కేసులు తప్పవు**

**: న్యాయ విచారణ చేసి బాధితులకు న్యాయం చేసే విధంగా పోలీస్ సేవలు**

**: ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజనల్ అధికారి ఆర్. రామాంజి నాయక్ రాకతో ప్రశాంతం**

**: స్టేషన్ కు వచ్చిన ప్రతి ఫిర్యాదును సామరస్యంగా పరిష్కరించడమే లక్ష్యం**

**: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారిపై నైనా కేసులు నమోదు**



**ఆత్మకూరు ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ఎస్సీ, ఎస్టీ,కేసులలో సబ్ డివిజనల్ పరిధిలో రాజీ పడే ప్రసక్తే లేదు అంటూ గ్రామీణ ప్రాంత, పట్టణ ప్రజలకు పోలీస్ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు విస్తృతంగా పోలీస్ సేవల్ని అందిస్తున్నారు నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరన్ ఐపీఎస్ ఆదేశాలతో ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజనల్ అధికారి ఆర్. రామాంజి నాయక్ పర్యవేక్షణలో ప్రతిరోజు పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదులను గౌరవంగా స్వీకరిస్తూ ఆ సమస్యల్ని సామరహస్యంగా పరిష్కరిస్తూ ప్రజలకు ఫిర్యాదుదారులకు పోలీస్ సేవలు అందిస్తున్నారు ముఖ్యంగా పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారిపై నైనా కేసులు పెట్టక తప్పదని ఘాటుగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు భూ సమస్యలు, ఇంటి సమస్యలు, ఇతర సమస్యలపై ఇరు వర్గాల వాళ్ళు తగాదాలు పడితే కేసులు పెట్టక తప్పదని హెచ్చరిస్తున్నారు పోలీస్ శాఖలో ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి రక్షణ కల్పించే విధంగా చొరవ తీసుకుంటున్న ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజనల్ పరిధిలో ప్రజలు పెద్ద ఎత్తున అభినందనలు తెలియజేస్తున్నారు ముఖ్యంగా యువత వేసవి కాలంలో సెలవులు రావడంతో విచ్చలవిడిగా ఆన్లైన్ బెట్టింగులు మాదకద్రవ్యాలు అసాంఘిక శక్తులకు పాల్పడితే యువతపై కేసులు పెట్టక తప్పదం లేదు ఎస్సీ ఎస్టీ కేసుల పై పోలీస్ సబ్ డివిజన్లో రాజీ పడే ప్రసక్తే లేదంటూ తప్పు చేసేవారికి శిక్ష తప్పదు అంటూ పోలీస్ శాఖ గ్రామీణ ప్రాంత పట్టణ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు గ్రామసభలు రాత్రివేళ సమయంలో అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిగా తోపాటు శాంతి భద్రతలపై ప్రజలకు ప్రశాంతమైన వాతావరణంలో పోలీస్ సేవలు అందిస్తున్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ ఐపీఎస్ కు ఆత్మకూరు డిఎస్పి ఆర్. రామంజి నాయక్ కు ప్రజలు ఫిర్యాదుదారులు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నారు

# బస్టాండ్ ఆక్రమించిన పానీ పూరి బండి

**: ప్రయాణికులకు ఇక్కట్లు..**



**ప్యాపిలి ఏప్రిల్25ప్రభాతవార్త:** కవితకు కాదేది కనర్హం అన్న రీతిలో ఆక్రమించడానికి ఏదైనా ఒకటే అన్న విధంగా ఆక్రమణ దారులు వివరిస్తున్నారు. ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన బస్టాండ్ సైతం అక్రమార్కులు వదలడం లేదు. ప్రజలు ఎటు పోయినా పర్వాలేదు తాము మాత్రం బాగుంటే చాలన్న చందాన ప్రస్తుత కాలంలో ప్రజలు జీవిస్తున్నారు. తమకు ఆదాయం వస్తే చాలు ఆక్రమణలకైనా సిద్ధమని నిరూపిస్తున్నారు. బస్సుల కోసం వేచి ఉండటానికి ఏర్పాటు చేసిన బస్టాండ్ ను పానీ పూరి బండి ఆక్రమించిన ఉదంతంపై ప్రభాతవార్త కథనం. నంద్యాల జిల్లాలో ప్యాపిలి మండలంలోని హుసేనాపురం గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్ ను పానీపూరి బండి ఆక్రమించిందని ప్రజలు తెలిపారు. హుసేనాపురం గ్రామం మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉండటానికి ఏర్పాటుచేసిన బస్టాండ్ కు పానీ పూరి బండి అడ్డంగా మారింది. దీనికి తోడు పానీ బండి పూరి వద్ద మందుబాబులు ఆగడాలు శృతి మించిపోతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పానీపూరి బండి వద్ద ఆకతాయిలు గూమిగుడి ఉండటంవల్ల ఆ ప్రాంతంలో సంచరించడానికి కూడా మహిళలు భయపడుతున్నారు. బస్టాండ్ వద్ద ఉన్న పానీ పూరి బండి బస్సుల కోసం వచ్చే మహిళలకు ఇబ్బందిగా మారింది. ప్రయాణం చేయాలనే తలంపుతో వచ్చే మహిళలు పానీ పూరి బండి అడ్డంగా ఉండటం వల్ల అతివైపు రావడానికి కూడా జంకు తున్నారు. బస్టాండ్ సమీప ప్రాంతంలో నిలిచే ఆటోల కోసం వచ్చే ప్రయాణికులకు కూడా పానీపూరి బండి అడ్డంకిగా మారింది. బస్టాండును పానీపూరి బండి ఆక్రమణ వల్ల కనీసం నిలవడానికి కూడా చోటు లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు అక్కడే మందుబాబులు కేకలేసుకుంటూ పానీ పూరి వద్ద ఉండడం వలన ఇబ్బందులు పడుతున్నామని మహిళా ప్రయాణికులు చెప్తున్నారు. పానీ బండి పూరిని తొలగించాలని పలుమార్లు చెప్పుతున్నప్పటికీ పట్టించు కోవడంలేదని గ్రామ ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి బస్టాండ్ ఆక్రమించిన పానీ పూరి బండిని తొలగించి అసాంఘిక కార్యక్రమాలను నివారించాలని ప్రజలు కోరారు..

## అజాత అగ్ర టెక్ సీడ్ ప్రాసెస్ ప్లాంట్‌ను ఆకస్మాతిక తనిఖీ..

**: జిల్లా వ్యవసాయ అధికారి**



**ఆదోని ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ఆదోని పట్టణంలోని అజాత అల్ట్రాటెక్ సీడ్ ప్రాసెస్ ప్లాంట్ ను జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి అకస్మాత్తుగా తనిఖీ నీ శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనిఖీలో భాగంగా ప్లాంట్లో ప్రాన్సిస్ జరుగుతున్న పత్తి విత్తనాలు నాణ్యత భద్రత మరియు ప్రెస్సింగ్ విధానాలను సవివరంగా పరిశీలించి విత్తనాల నాణ్యత నిర్ధారించేందుకు హెచ్ది వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించారు అన్నారు విత్తనాలలో మొలక శక్తి శక్తి తేమశాతం స్వచ్ఛత వంటి ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని విధానాలను పరిశీలించామన్నారు. అదేవిధంగా సీడ్ ప్రాసెస్ కు సంబంధించిన రికార్డులు లైసెన్స్ ను స్టాక్ రిజిస్టర్లు బ్యాచుల వారిగా నిర్వహణ వివరాలు వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేశామన్నారు నాన్నత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వ ప్రభుత్వం మార్గదర్శలను తప్పకుండా అనుసరించాలని సంబంధిత యాజమానికి సూచించమన్నారు. ఈ కార్యక్రమంలో సహాయక వ్యవసాయ సంచాలకులు బాలవర్ధిరాజు మండల వ్యవసాధికారి సుధాకర్ జిల్లా టెక్ని టెక్నికల్ ఏవో కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీభక్త కనకదాస్ విగ్రహ ఏర్పాటుకు 50 వేలు విరాళం.



**కర్నూలు సీటీ ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా మద్దికేర మండలం,మద్దికెర మండల కేంద్రం లో ఏర్పాటు చేయబోతున్న శ్రీ భక్త కనకదాసు విగ్రహం నిమిత్తం కర్నూలు జిల్లా కురువ సంఘం గౌరవ అధ్యక్షులు కే.శే. డాక్టర్ పుల్లన్న గారి పేరు కు గుర్తుగా కూతురు శ్రీ లీలమ్మ 50 వేల రూపాయలు నగదు విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గడ్డం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్‌ను కలిసిన టిడిపి నేత రాజేంద్రగౌడ్



**తుగ్గలి,ఏప్రిల్ 25,ప్రభాతవార్త:** నియోజకవర్గం శాసనసభ్యులు కేఈ శ్యామ్‌కుమార్ ను శనివారం టిడిపి నేత చెన్నంపల్లి రాజేంద్ర గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా గ్రామంలో అభివృద్ధి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వారు చర్చించారు. చెన్నంపల్లి గ్రామంలో ఉండే పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రదానంగా తాగునీరు, రోడ్లుచ విధ్యుత్ సమస్యలపై వివరించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పంధిస్తూ ప్రజలకు అవసరమైన మైలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సమస్యలను దశలవారిగా పరిస్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో స్తానిక టిడిపి నాయకులు దివాకర్ చౌదరి, రామాంజనేయులు గౌడు, అక్బర్, ఉరుకుంద గౌడ్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రిప్ పైపుల దొంగను.. స్తంభానికి కట్టి పోలీసులకు అప్పగింత..



**ఆదోని క్రైమ్ 25 ఏప్రిల్, ప్రభాతవార్త :** ఆదోని మండల పరిధిలోని పాండవగల్లు గ్రామంలో డ్రిప్ పైపుల దొంగతనం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామస్తులు అప్రమత్తంగా వ్యవహరించి దొంగను పట్టుకుని స్తంభానికి కట్టి పోలీసులకు అప్పగించారు. పాండవగల్లు గ్రామంలో రైతుల పొలాల్లో వరుసగా జరుగుతున్న డ్రిప్ పైపుల దొంగతనాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బాలయ్య గారి రోగన్న పొలంలో డ్రిప్ పైపులు దొంగలిస్తున్న వ్యక్తిని గ్రామస్తులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దొంగను తప్పించుకోకుండా గ్రామస్తులు స్తంభానికి కట్టి ఉంచారు. సమాచారం అందుకున్న పెద్ద తుంబలం ఎస్సై విద్యశ్రీ ఆదేశాల మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇటీవల గ్రామాల్లో వరుసగా జరుగుతున్న దొంగతనాలపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామాల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని పోలీసు శాఖను గ్రామస్తులు కోరుతున్నారు